"మీరు పాట వింటారా ? వాయిద్యం నేర్చుకుంటారా ? ఇందిరా ?" అనడిగాడు సుందర్రావు.

"మీ పాటనే వింటాను" అన్నది ఇందిర.

నెల్లాళ్ళయి ఇదే వరస. సాధనకన్న పాట వింటేనే మనసుకు ఆనందం. ఇది ఇందిర మనసు. మరి విధ్యుక్తధర్మం విస్మరించిన సుందర్రావు గతి ?

తాను చెప్పినది చేయడమే అతని విధి అని శాసిస్తుంది ఇందిర.

ఏమైనా ఎడబాటు తప్పనిదే అయింది.

మధ్యలో తండ్రి వివాహం నిశ్చయం అయిందంటాడేమిటి ?

"హబ్బ ! చంపేశావు. ప్రెస్ కాన్ఫరెన్సుల్లో విలేఖరు లడిగినట్టు అన్ని ప్రశ్న లడిగితే నే నెలా జవాబు చెప్పి యాడవను ?" అన్నాడు రామం సిగరెట్టు పెట్టె బయటకు తీస్తూ.

"అయితే ఒక్కొక్క ప్రశ్నకే జవాబు చెప్ప వోయ్ భగవాన్లూ" అన్నాడు సుందర్రావు. రామం సిగరెట్టు వెలిగించుకోబోతూ ఈ మాట విని నవ్వాడు. ఆ నవ్వుకి అగ్గిపుల్ల ఆరిపోగా ఇంకొకటి ముట్టించి, సిగరెట్టు వెలిగించాడు. "వెరీ గుడ్ ! చమత్కారంగానే మాటాడుతున్నావే ! దూరం నించి నిన్ను చూసి ఇవ్వాళో బుడ్డెడు ఆవదం సేవించా వని భ్రమపడ్డాను !" అన్నాడు రామం సిగరెట్టు పొగ వదులుతూ.

"అది సరిలే ! ఇక ఆరంభించు నీ కథ."

"నా కథ నే నేకరుపెడతా గాని మహాత్మా ! మీ కథ కానిండి" అన్నాడు రామం సుందర్రావు వీపు తడుతూ. సుందర్రావు గట్టిగా వూపిరి పీల్చి ప్రారంభించాడు. "అయితే కాసుకో ! మొదటిసారి నేను బియ్యే పరీక్ష ప్యాసయినప్పుడు 'జనరల్ ఎకనామిక్స్' పేపర్లో ...... "

"ఘోరం ! ఘోరం ! ఇన్ని వివరాలను భరించ లేం ! క్లుప్తంగా చెప్పెయ్ !" రామం మధ్యలో అడ్డు తగిలాడు.

"క్లుప్తంగా అయితే విను. సంక్షిప్త వార్తలు. ఈ సుందర్రావనేవాడు పోయిన సెప్టెంబరులో బియ్యే పాసయ్యాడు. అప్పట్నుంచీ వీధులు సర్వే చేస్తున్నాడు."

"ఉద్యోగం, గట్రా .... " రామం ప్రశ్నార్థకంగా చూశాడు.

"వేన్నీళ్లకు చన్నీళ్ల మాటేనా నువ్వనేది ?" సుందర్రావు సీరియస్‌గా అడిగాడు.

"అంటే ?" ఆశ్చర్యపోయాడు రామం.

"సరే లేవోయ్ ? ఇంతేనా నీ తెలివి ! మా నాన్నకు తెలిసే విషయం నీకు అంతు పట్టలే దన్న మాట. ఉద్యోగం సంపాదించే ప్రయత్నంలోనే ఉన్నాను గాని ఇంకా అదృష్టం ఎదురుపడలా."

"తెలుస్తూనే ఉంది, నీ వాలకం చూస్తే" అన్నాడు రామం అరంగుళం అరిగిన సుందర్రావు పాదరక్షలను చూస్తూ.

"గ్రహించావు కదూ ! ఇక నీ విషయం కానీ."


"చెబుతా కానీ, ముందు నువ్వీ ప్రశ్నకు జవాబు చెప్పు మనం కాలేజీలో చదివేటప్పుడు నీవు జోరుగా పాటలు పాడేవాడివి కాదూ !"

"బాగున్నావా బంగారయ్యా అంటే బర్రె యీనిందా అన్నాట్ట నీలాటి నాయనే ఒహడు. పూర్వ గాథాలహరిలో వృత్తాంతా లన్నీ యిప్పు డెందుకు గానీ, నీ సంగతి చెప్పవోయ్ బ్రదర్."

"అవసరముండే అడుగుతున్నానురా ! నేను ప్రోగ్రామ్ నిర్వాహకుడుగా "ఆకాశవాణి" లో పని చేస్తున్నాను. ఏణ్ణర్థం నుంచీ విజయవాడలో ఉన్నాను. కొద్దిరోజు లయింది ఇక్కడికొచ్చి. మే మిప్పుడు "నవ్య సౌరభాలు" అనే కొత్త కార్యక్రమం ఏర్పాటు చేయబోతున్నాం. మన దేశంలోని యువ గాయకు లందర్నీ ఈ కార్యక్రమంలో శ్రోతలకు పరిచయం చేయాలని మా సంకల్పం. నీవూ దీనిలో పాల్గొనరాదుట్రా !"

"చాలా థాంక్సురా, రామం ! కానీ మన మా అవతారం చాలించేశాం. కాలేజీ వదిలేశాక సంగీతాని కిన్నీ తిలోదకా లిచ్చేశాను" అన్నాడు సుందర్రావు.

"రేడియోలో పాడడమంటే ఏవి టనుకున్నావురా ! అస్త్ర సన్యాసం చేసిన అర్జునుడిలా మాట్లా



డకు. ఒక్కసారి పాడావంటే దేశం మొత్తంమీద లెక్కలేనంత మంది నీ కంఠాన్ని విని ఆనందిస్తారు తెలుసా !"

"నా క్కావలసింది కీర్తి కాదోయ్, ఉద్యోగం ! తెలిసిందా ?"

"సుందర్ ! బొత్తిగా అంత వ్యాపారంలా మాటాడతావేం? ఇలా అయిపోతా వనుకోలేదు" చివాట్లు పెట్టే ధోరణిలో అన్నాడు రామ్మూర్తి.

"నా పరిస్థితుల్లో ఉంటే నీవూ ఇలాటి కబుర్లే చెప్పేవాడివి !"

"పోనీలే ! నీవు మా ప్రోగ్రాంలో పాల్గొన వలసిన అవసరం లేదు. రేపు మధ్యాహ్నం మూడు న్నరకి మా స్టూడియోలో ఆడిషన్ పరీక్ష ఉంది. కొందరు యువకుల కంఠాన్ని రేపు పరీక్షించబోతున్నాం. నీవు ఎలాగూ సర్వే డిపార్టుమెంటులో పని చేస్తున్నావు కాబట్టి మా స్టూడియోకి రావడానికి నీ కెలాటి కష్టమూ ఉండదు. వచ్చిన వాడివి అలాగే పాల్గొన్నావంటే, దానిలో పాసయాక కదా నిను ప్రోగ్రాంకు తీసుకుంటారు. అంత అపాయం జరగదులే !" అన్నాడు రామం తేలికగా నవ్వుతూ.

"ఏమిటోయ్ అంత డామేజీగా మాట్లాడుతున్నావు ? ఒక్క బిగిన నీవు పెట్టే టెస్టులు ముక్కై పాసవుతాను. నీకు మళ్ళీ గుర్తుకు తెస్తే బి. ఎ. చదువుకుంటున్నా ననుకుంటావు గాని ఇంటర్ యూనివర్సిటీ సంగీతపు పోటీల్లో కర్ణాటక సంగీతం, లలిత సంగీతం రెంటిలో గాత్రంలో ఫస్ట్ ప్రైజు ట్రోఫీని గెలిచాను. ఎరుగుదువా !"

"చాల్లేరా ! వూరుకున్నకొద్దీ డాం డచ్చాలు కొట్టేస్తున్నావు. నీ తలమీ దొరిపోయే జేజివాయన లెందరో మా దగ్గిర చతికిలబడిపోయారు. పాడగానే సరిపోలేదు. కంఠం మైక్‌కి సరిపోవాలి. కబుర్లెందుకు ? కలేజా వుంటే రేపు స్టూడియోకి రా ! నీ వెందుకూ పనికిరావని నిరూపించేస్తాను" అన్నాడు రామం చేతులు దులుపుకుంటూ.

"పందెమేనా ?"

"పందెమా ! నీవు సెలక్టయితే నేను చెవి కోయించుకుంటాను. సరా !"

"ముందే చెబుతున్నానోయ్ ! చెవి వృధాగా పోగొట్టుకుంటావు."

"అయితే తప్పక వస్తావుకదూ."

"తప్పక వస్తాను. నీ చెవిమీద ఒట్టు !"

"వెరీగుడ్."

కాసేపుండి మిత్రులు విడిపోయారు.

మరురోజు రేడియో స్టేషనులో టెస్టు అయిపోయాక దానిలో పాల్గొన వచ్చినవారే కాదు, అక్కడి సిబ్బంది యావత్తూ సుందర్రావుని అభినందించారు. "ఈయన కంఠం మన కార్యక్రమానికి వన్నె తెస్తుం దనడంలో ఏమాత్రం అతిశయోక్తి లేదు" అన్నా రొకరు. రామం ఎంతో సంతోషించాడు. ఈ విజయమంతా తనదే అయినట్టు మురిసిపోయాడు.

బయటికి వచ్చాక సుందర్రావు "ఏమోయ్, వాన్‌గోగ్ ! ఇపుడు నీ చెవిని ఎవరి చేతిలో ఉంచుతావు ?" అన్నాడు పరిహాసంగా.

రామం నవ్వి "ఇప్పుడు టిఫెన్ నీ కడుపులో ఉంచబోతున్నానోయ్" అన్నాడు. కాసేపాగి "పాపం! నా మాటలకు మోసపోయి నీ వివాళ వచ్చావనుకుంటాను" అన్నాడు.

"లేదు లేరా ! నీ కంటే రెండాకులు ఎక్కువే చదివాను. మీ కార్యక్రమం ఇరవైనాలుగో తేదీనాడు కదూ ! అప్పటి వరకూ నే జెప్పినట్లల్లా చేస్తావు కదూ !"

"బాబ్బాబు ! ప్రోగ్రాంనాడు మొహం తప్పించ గలవు ! చెడ్డపే రొస్తుంది. నీ వేం చెబితే అది చేస్తాను". బ్రతిమాలుకున్నాడు రామ్మూర్తి.

"సరే ! అలా రా దారికి" అన్నాడు సుందర్రావు.

ఉపాధ్యాయుడు—చైనా జనసంఖ్య చాలా అధికం. ఎంత అధికమంటే మనం ఒక్కసారి గాలిపీల్చి వదిలే సరికల్లా ఒక చైనావాడు చస్తూ ఉంటాడు...

ఒక అమ్మాయి పాఠం వినకుండా అప్పుడే పరుగెత్తుకొని వచ్చినట్లు రొప్పుతూ ఉంటే "ఏమిటది" అని ఉపాధ్యాయుడు గద్దించి అడిగాడు,

"చైనా వాళ్ళను చంపేస్తున్నాను సార్" అన్నది ఆ విద్యార్థిని.

—ర. సౌభాగ్యవతి (పాన్నికల్లు)

ఇరవైనాలుగో తారీఖు వచ్చేసింది. రేడియో ప్రోగ్రాంకు వెళ్దామా వద్దా అని సుందర్రావు ఆలోచించాడు. కానీ రామ్మూర్తికి మాట ఇచ్చాడు. కాబట్టి వెళ్ళా లనుకున్నాడు. తనకి యింట్లో వాతావరణం ఏమీ సరిపోలా. అందరూ ఏదిటో శత్రువును చూసినట్లుగా చూస్తున్నారు. ఆ రోజు ఉదయమే గడ్డం చేసుకుందామని తమ్ముణ్ణి వేన్నీళ్ళు తెచ్చిపెట్టమంటే, నాన్న విని "చదువుకునేవాణ్ణి లేపకపోతే పోయి తెచ్చుకోరాదూ ! నీకంతా తీరుబాటేగా !" అన్నాడు. తనెలాగ ఏడవ లేకుండా ఉన్నాడో ఆశ్చర్యం. ఛీ, ఛీ, ఈ కల్మషంలో యిక వూపిరి పీల్చలే ననుకొని గడ్డమైనా చేసుకోకుండానే బయటికి వచ్చేశాడు. పన్నెండున్నర వరకూ అటూ యిటూ తిరిగాడు. బాగా ఆకలేస్తున్నా లెక్కచేయకుండా ఒంటిగంటకు రేడియో స్టేషన్ చేరుకున్నాడు. రామం ఎంతో ఆప్యాయంగా పిలిచి పలుకరించాడు. "ఏంరా ! అలా దిగాలుపడి వున్నావేమిటి ?" అని అనునయంగా అడిగాడు. తనకి భయం పట్టుకుందని బొంకేశాడు సుందర్రావు. రామ్మూర్తి అతడికి ప్రోత్సాహన్నిచ్చే మాటలు మాటాడాడు. ఖులాసా కబుర్లు చెప్పి నవ్వించాడు. ఆ క్షణంలో రామం అతడి కెంతో సన్నిహితుడుగా కనిపించాడు. అతడి భుజంమీద తల పెట్టి ఏడ్చి తన బాధలు చెప్పుకోవా లనుకున్నాడు. ఇంతలో ప్రోగ్రాం వేళయింది. బరువు గుండెలతోనే లోపలికి నడిచాడు.

## సుందరికాండ

అందమైన వో భవనం. దానిలో సుందరమైనవో హాలు. అందులో "ఎవరీ అరవిందాక్షి ?" అని అందరి డెందాలూ కొందలపడ జేసే వో సౌందర్య రాశి. పసందయిన ఆ సుందరి పేరు ఇందిర.

ఇందిర సోఫాలో చేరగిలబడి కూర్చొని రేడియోను వింటోంది.

"ఆకాశవాణి. నేడు "నవ్య సౌరభాలు" అనే మా కొత్త కార్యక్రమంలో మొదటిసారిగా హైదరాబాదుకు చెందిన కె. సుందర్రావు అనే యువకుని కంఠాన్ని మా శ్రోతలకు పరిచయం చేయబోతున్నాం .... రండి సుందర్రావుగారూ ! మీ గానాన్ని వినిపించండి" అంటోంది వో కంఠం రేడియో లోంచి.

సుందర్రావు ఒక విషాద గీతాన్ని అందుకున్నాడు. శివరంజనిలో, తారస్థాయిలో గాంధారం వద్ద ఆరంభించి జాలీ, విచారమూ ముప్పిరిగొనేలా రాగాన్ని ప్రసరించాడు. మంద్రంలో పంచమాన్ని తాకి హృదయంలోని వేడి నిట్టూర్పులు వెలికి వచ్చినట్టు భ్రాంతి గొలిపాడు. "ఎంత అనిశ్చితమైన దీ జీవితం!" అని స్ఫురింపజేసేటట్టు ఒక స్వరం కూడా సరిగా నిలవక దూరదూరంగా అంగలు వేసుకుంటూ కంఠాన్ని ముందు వెనుకలకు పరువెత్తించాడు. తన జీవితంలోని నిస్సారతను చూపుతున్నట్టు పేలవంగా పాడాడు. పాట వింటున్నంతసేపూ ఆ అనుభవమే కలుగలేదు. "ఇదొక దౌర్భాగ్యజీవి విషాదగాథ. అతడి యెదలో గూడుకట్టుకున్న నిశ్శబ్దమైన ఆర్తనాదాన్ని వింటున్నాం" అని భ్రమింపజేశాడు. సాహిత్యమూ, సంగీతమూ రెండూ పోటీ పడగా వానిని సంధానించే నియంతగా తన కంఠాన్ని విప్పి, కాసించి అసురసంధ్యలో తల్లి కోసం పలవరించే లేగ దూడను, అమాయిక బాల కనుకొలకులలో మెరిసే తుషారకణాలనూ, అరవిచ్చిన కన్నులనుండి రెప్పల మీదుగా జారిపోయిన మధుర స్వప్నాలలోని సందేశాన్ని తలపింపజేశాడు.

పాట అయిపోయేసరికి ఇందిర తామర పత్రాల వంటి నేత్రాల్లో బయలుదేరిన బాష్పాలు మెత్తని బుగ్గల మీదుగా దారి చేసుకుని చారలు చారలుగా నీలి రేయాన్ చీర క్రింది వెల్వెట్ బ్లవుజుమీద పడి యింకిపోయాయి.

"మీ పాట అద్భుతంగా ఉంది సుందర్రావు గారూ ! మీరు మాకీ ఆనందాన్ని కలిగించినందుకు ధన్యవాదాలు. తరచు మీరు మా కార్యక్రమాల్లో పాల్గొంటూ ఉండాలి ...... " రేడియో పలుకుతోంది.

ఓ దాసీది గదిలో కొచ్చి "అమ్మగారూ, మాస్ట

"అమ్మ వచ్చారు" అని చెప్పి వెళ్ళిపోయింది. ఇందిర త్వరత్వరగా మొహం తుడిచేసుకుని విసుగ్గా రేడియో ఆఫ్‌చేసి, వయొలిన్ ముందేసుకుని కూర్చున్నది.

ఓ నాలుగు వలాల గరళాన్ని చేతిలో వుంచి "ఇది అమాంతం మింగెయ్!" అంటే ఇందిర నిస్సంకోచంగా మింగేసి ఉండేది. కాని మాస్టరమ్మ వద్ద సంగీతం నేర్చుకోవాలంటే ప్రాణగండంగా ఉంది ఇందిరకు. పైగా ఈరోజు మనసు కూడా అంత బావుండలేదేమో, తన కోపాన్నంతనీ వయొలిన్ మీద చూపిస్తూ శ్రుతిచేయ నారంభించింది.

కళ్లజోడు పెట్టుకుని, చేతిలో సంచీ వూపుకుంటూ నడి వయస్సులో వున్న వో స్త్రీ ప్రవేశించింది. "ఏం ఇందిరా ? నిన్నటి పాఠం వచ్చిందా?" అంటూ సోఫాలో కూలబడింది.

"ఆఁ! వచ్చింది" అని గట్టిగా తలూపి వర్ణం వాయించడం ప్రారంభించింది. కాసేపు విని టీచరు "అన్నీ తప్పుగానే వాయిస్తున్నావు. రిషభం అది కాదు రెండోది" అన్నది కోపంగా.

ఇందిర హైస్కూలు అమ్మాయిలా తలూపి మళ్ళీ మొదటినుండీ వాయించడం ప్రారంభించింది. ఈసారి ఏమి అపస్వరం వినబడిందో "అయ్యో, అయ్యో! ఇంత నిర్లక్ష్యమా! ఇలా వాయించావంటే నీ కసలు సంగీతం రానేరాదు" అన్న దావిడ.

"పోనీలెండి! రావాలని కోరుకున్న దెవరు ?" అన్నది ఇందిర కమాను పెట్టెలో ఉంచుతూ.

"ఏఁవిటమ్మాయ్! పెడసరంగా ఆ మాటలు ? సంగీతం అంటే ఆషామాషీ అనుకున్నావా ?" అంది కోపంతో ఎర్రగా అయి ఆవిడ.

ఇందిర ఇది విని మరీ రెచ్చిపోయింది. "చూడండి టీచర్! ఈరోజు నా మనసేమీ బావుండలేదు. పైగా సంగీతం నేర్చుకోవాలని నాకేమంత పెద్ద అభిలాష లేదు. ఈ సంగతి మీరు గుర్తుంచుకుంటారు కదూ! వస్తాను, నమస్తే" అని వయొలిన్ అక్కడ ఎత్తేసి చరచరా హాల్లోంచి వెళ్ళిపోయింది.

సంగీతం టీచరు కళ్లజోడు లోంచి నిదానంగా వెళ్ళిపోతున్న ఇందిర కేసి చూసింది. తర్వాత క్రింద పడిపోయిన వయొలిన్ కేసి చూసి తెల్లబోయింది. ఆమె కేవీ అర్థం కాలేదు.

## అరణ్య (లేక పార్కు) కాండ

పెద్ద జరీ బోర్డరు ఆకుపచ్చ సిల్కు చీర, నయాపైసా బొట్టు, కళ్లకు కాటుక తీర్చి అపరంజిబొమ్మలావున్న ఇందిర పోర్టికోలోకి వచ్చి డ్రైవర్ని కేకేసింది. డ్రైవర్ కారు తీసుకొని రాగానే "పబ్లిక్ పార్కుకి పోనియ్!" అని పురమాయించింది. దారిలో కొంచెం ఫలహారం కొని కట్టించుకుని మరీ పార్కుకు వెళ్లింది.

పార్కు దగ్గర కారు ఆగాక వాచీకేసి చూసుకుంది. ఉదయం పదకొండు గంట లయింది. "సాయంత్రం నాలుగింటికి కారు తీసుకొచ్చి ఇక్కడే నన్ను కలుసుకో" అని చెప్పింది. డ్రైవరుతో.

"మరి, అమ్మగారూ! మధ్యాహ్నమంతా ...." డ్రైవర్ నసిగాడు.

"ఎక్కడో ఉంటాను. నీ కెందుకు ? వెళ్ళు" అని కసిరేసి పార్కులోకి వెళ్లింది.

మధ్యాహ్నం కావస్తోంది. కాబట్టే జనం పార్కులో పలచగా ఉన్నారు. నిర్జనంగా ఉన్న ఓమూల ఫలహారం ముందేసుకుని కూర్చుంది. కాసేపు తనకు స్వతంత్రం లభించిందని సంతోషించింది. ఇందిర తండ్రి ఓ పెద్ద లక్షాధికారి. పెద్ద వ్యాపారస్థుల్లో ఒకడు. ఇందిరకు తల్లి లేదు. తండ్రికి ఇంటి గొడవలు చూసుకునే ఓపిక లేదు. కాబట్టి ఇంట్లో ఇందిర మాటే చలామణీ అవుతోంది. జీవిత మంటే ఆమెకు పువ్వుల బాటే కావచ్చు. కాని దానిలోనూ కంటకా లున్నాయనేది స్పష్టం. ఆమె జీవితంలో ముఖ్యమైనది అనదగిన కంటకం ఆమెకు సంగీతం చెప్పే టీచరు పేరిట చెల్లుబా టవుతున్నది. నాగసాకీ మీద ఆటం బాంబు వేయడం వల్ల ఆ వాతావరణం ఎలా కలుషితమైపోయిందో, హైదరాబాద్ నగర వాతావరణం కూడా అలా కలుషితమై పోవడానికి ఆవిడే కారణమని ఇందిర దృఢవిశ్వాసం. ఆవిడ జ్ఞాపకం రావడంతోటే ఇందిర గుండెల్లో రాయి పడింది. ఒంటిగంట కుండే పాఠాన్ని తప్పించుకోవాలని తనిలా పారిపోయివచ్చేసింది. పాఠం చూస్తేనా వచ్చి ఛావదాయిరి! కష్టపడి కృషి చేయడాని కయినా ఉత్సాహ ముండి ఏడిస్తేనా ?

"హుఁ! శుద్ధ రిషభం కాదు. రెండోది!" అని బరువుగా నిట్టూర్చింది. గడ్డిపరక నోట్లో ఉంచుకొని నములుతూ తిరిగి ఆలోచనల్లో పడిపోయింది. ఆలోచించేకొద్దీ చెడ్డ తలంపులు వికటాట్టహాసం చేస్తూ ఆమెకు భయం కలిగించినై. ఈ బాధ భరించలేక ఆలోచించడం మానేయాలనుకుంది. గాలికి మెల్లగా వూగే సరుగుడు చెట్లను చూసింది. కాసేపు రోడ్డుమీంచి వినబడే అరుపులను విన్నది. మరి కాసేపు దూరంగా కనవచ్చే నౌబత్ పహాడ్‌వేపు చూసింది. అయినా ఆలోచనలు ఆమెను వెన్నాడుతూనే ఉన్నాయ్.

"ఛీ! ఏఁవిటీ అర్థం పర్థం లేని ఆలోచనలు ? ఏదేనా మంచి విషయం గురించి ఆలోచిస్తే ?" అనుకుంది. తనకి సంగీతమంటే ఇష్టమేనా ? ఎందు కిష్టంలేదు. ? ఆ రోజా అబ్బాయెవరో రేడియోలో పాడితే ఏడ్చేసింది తను. తన కళ్ల వెంట నీరెలా కారిందో తనకే తెలియదు. పరవశత్వం అంటే అదే నేమో! కాని టీచర్ పాటలు చెబితే కాస్తయినా బుర్ర కెక్కదేం ? ఆ సాలూ, రీలూ, గాలూ ఎంత చెప్పినా అర్థంగావు. ఆ అబ్బాయి పాడితే మట్టుకు వినసొంపుగా ఉంది. మనసుకు హాయనిపించింది, పంటచేల మీద నించి పైరు గాలి వీచినట్టు, ఆకాశంలోంచి జాలువారే అమృతధారతో తడిసినట్టు. అబ్బ! అంత బాగా పాడగల అబ్బాయి లుంటారా! సినిమాల్లో పాడుతుంటారుగాని వారు యంత్రాలతో ఏదో మంత్రం చేస్తారులెద్దూ! కాని ఆ అబ్బాయి రేడియోలో నిజంగా వచ్చి పాడాడంటే, నిజంగా అతడంత బాగానూ పాడగలిగినవాడై ఉండాలి. సంగీతం నేర్చుకుంటే అలాటి వాళ్ల దగ్గర నేర్చుకోవాలి. వాళ్ల టీచరు పాడుతుంది చూడరాదూ! దానిలో అన్నీ ప్రతిమధ్యమాలూ, కాకలి నిషాదాలూ విన


నమ్మకమైన
పాతబియ్యం
«శ్రీ విజయ»
రైస్ కంపెనీలో
లభించును
గవర్నరుపేట, విజయవాడ-2
ఫోన్ నెం.704

Tel: SOUND Phone No 120.
స్త్రీలపాలిటి కామధేనువు
"డిస్మిక్యూర్"
(రిజిస్టర్డు)
(ఋతుశూలహారి)
వేలకొలది స్త్రీలు "డిస్మిక్యూర్" వాడి గంటునొప్పి బాధనుండి నివారింపబడిరి. గంటునొప్పి బాధను గ్యారంటీగా పోగొట్టును. వెల రు. 4-0-0
డాక్టర్ సి.మల్లిక్స్ ఫార్మసీ
విశాఖపట్నం
డిస్ట్రిబ్యూటర్సు :
వైజాగ్ రేడియో కో., విశాఖపట్నం-1.

పోస్టుద్వారా చిత్రకళ నేర్చుకోండి



శ్రీ ఎం. వెంకటరామయ్య, అయోధ్యరామపురం, తూ॥గో॥జిల్లా వ్రాసిన లేఖ: "ఆర్యా, మీ పాఠములు నాకు సక్రమంగా అందుచున్నవి. అవి చాలా ఆసక్తి కలిగిస్తున్నవి."
పై విధముగా వందలాది ఉత్తరాలు మాకు ప్రతిదినము ప్రపంచం నలుమూలలాగల విద్యార్థులనుండి చేరుచున్నవి. మీరుకూడా 2 ఏండ్లలోగా ఇంగ్లీషు లేక అరవములో నేర్చుకొనవచ్చును. వివరములు గల ప్రాస్పెక్టస్ కొరకు 25 న.పైసలు పంపండి. ఉత్తరాలు ఇంగ్లీషులో నే వ్రాయవలెను.
Santhanu's Art Institute,
C/o Chit ra Kullan,
Chintadripet, Madras-2.
ఈ ఇన్‌స్టిట్యూటు దక్షిణఇండియా ప్రఖ్యాత చిత్రకారుడు 'శంతను' నడుపుచున్నారు.

ఆంధ్రప్రదేశ్ పంచాయితీల
జిల్లాపరిషత్తుల చట్టం సమితు
తెలుగుప్రతి వెల రూ 2-75 న. పై.
యింగ్లీషుప్రతి వెల రు 3-50 న. పై.
పోస్టేజి అదనం
శ్రీ సుసర్ల కృష్ణమూర్తిరావు,
అడ్వకేటు, రామారావుపేట, కాకినాడ.

RATNAM'S N-OIL

అంగసరములు బలహీనతి చెంది, చిన్న దినచో తిరిగి యథాప్రకారం అం॥ పూ సౌఖ్య మనుభవించుటకు 50 సం॥ ప్రఖ్యాతి కలది. 1 సీసా రూ. 10 లు వి. పి. 1-4-0 కావలసినవారు ముందుగా 1-4-0 పంపేది. ఇందులో స్పెషల్ రకం అర్ధంబుగుణమునకు రూ. 25-0-0 లు.
డాక్టర్. రత్నం సన్స్, (Estd 1904)
మలకపేటబిల్డింగ్స్, అజంపురా గేట్ వద్ద, హైద్రాబాద్ -24 (ఆంధ్రప్రదేశ్)

హోమ్ సినీప్రొజకర్ 15రు/లకే



అద్భుతమైన గృహవినోద సాధనము కల్పన, సాహసము, అద్భుతముగల సన్నివేశము లెన్నో యీ ప్రొజక్టరుతో మీ యింటియందే చూడండి. ఇది టార్చిలో లేక ఎసి/డిసి ఎలెక్ట్రిసిటితో పనిచేయును. ఉపయోగించదగు ఫిల్ము 35 ఎం.ఎం. బొమ్మలు తెరపై సజీవముగా పలురంగులలో నటించును. మీకు ఆశ్చర్యము కలుగును అనేకులు ఆకరింపబడుదురు. ధర రు 15/- 40 అ॥ ఫిలిం 4' × 3' సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టె ఉచితం. పోస్టేజి రు 4-50 అదనం. డిలక్సు స్పెషల్ ప్రొజక్టర్ ధర రు 25/ 60 అ॥ ఫిలిం & 4' × '3 సైజు స్క్రీను. దాని పనిచేయించే విధము, ఫిలిములపట్టె ఉచితం. పోస్టేజి రు 5 అదనం. అందరు కోరుచున్నారు! నేడే ఆర్డరు పంపండి.

HOLLYWOOD CINEMA CORP. (Regd.)
2194 Kalyanpura, Turkman Gate, (12)
DELHI-6.

# వసంత

బడలై తప్ప పాట మచ్చుకైనా వినబడదే! అన్నట్టు ఆ అబ్బాయి దీ వూరేనట. ఎక్కడున్నాడో తెలిస్తే బావుణ్ను ......

వాచీ చూసుకుంది. ఒక గంట మాత్రం గడిచింది. ఏం చేయాలో తోచక దిక్కులు చూస్తోంది. ఫలహార మేమన్నా తిందామనుకొన్నది. కానీ ఆకలి వేస్తున్న ట్టనిపించలా. ఇంతలో ఎవరో ఇద్దరబ్బాయిలు తను కూర్చున్న స్థలానికి దగ్గరగానే వచ్చి కూర్చున్నారు. వాళ్ల లోకంలో వాళ్లున్నట్టున్నారు. ఏదో మాటాడుకుంటూ హడావిడిగా వచ్చారు. ఒకడు ముంజేతిమీద ఆనుకొని కూర్చున్నాడు. ఇంకొక అబ్బాయి శుభ్రంగా మఠం వేసుకున్నట్టు కూర్చున్నాడు. ఏం ప్రదేశాలో, కాసేపయినా ఒంటరిగా కూర్చోడానికి వీలుండదు. ఎక్కడికయినా ఇంకోచోటికి పోదామా అని తన పెద్ద కళ్లను సారించి అటూయిటూ చూసింది.

"శరాజ రాకకై విరియు కలువలు రెండు" అంటున్నాడో అబ్బాయి. ఈ మాటలు విని తను ఆశ్చర్యపోయింది. తనను చూసే అంటున్నారేమో! తన కళ్లను కలువలతో పోలుస్తున్నాడా? ఎంత సాహసం! కోపంతో కళ్ళు దించేసుకుని తల వంచుకుంది.

"ప్రియు కరస్పర్శచే దొరలు సిగ్గది మెండు" అదే గొంతు మళ్లీ పలికింది. ఆ కంఠం ఎక్కడో విన్నట్టే వుంది. కానీ కోపంలో తనిదేమీ పట్టించుకోలా. ఇప్పుడు తనకి రుజువయిపోయింది, వాళ్లెందుకిలా వెకిలి వేషాలేస్తున్నారో! వంటరిగా ఉన్న అమ్మాయిలను చూస్తే అబ్బాయిల కెంత లోకువ! ఛీ! ఇలా కాదు. వీరికో గుణపాఠం నేర్పాలి, అనుకుంది మెల్లగా వారు కూర్చున్న స్థలంవేపు ధైర్యంతో నడిచి వెళ్లింది.

"నమస్తే! నా పేరు ఇందిర!" అన్నది కోపంగా వారి నుద్దేశించి. మిత్రు లిద్దరూ ఆశ్చర్యంతో తికమక లయ్యారు. ఒకడు మాత్రం రెండోవాడితో "ఒరే! మెంటల్ హాస్పిటల్లో డాక్టర్లు ఈరోజు జాగ్రత్తగా ఉన్నట్టు లేదురా!" అన్నాడు. రెండో అతను మాత్రం ధైర్యంగా "నమస్తే! నా పేరు సుందర్రావు!" అన్నాడు.

ఇందిర కోపంగా రెండో వ్యక్తి వేపు చూసింది. "మావాణ్ని అట్టే గమనించకండి. వాడు ఝట్టి సైడ్ హీరో. తొందరపడి అభిప్రాయాలు వ్యక్తీకరించడం వాడి రివాజు. పేరు రామ్మూర్తి. రేడియోలో ఉద్యోగం వెలగబెడుతున్నాడు" అన్నాడు సుందర్రావు.

"వంటరిగా ఉండే అమ్మాయిలను ఏడిపించే ఉద్యోగం మీరు వెలగబెడుతున్నారా?" గంభీరంగానే మొహం జేవురింపజేసుకుని అడిగింది.

"కరెక్ట్! బాగా అడిగారు. మీరేనా బుద్ధి చెప్పండి. పై జెప్పబడిన ఏ డైలాగు నైతే విని మీరిక్కడి కొచ్చారో సదరు డైలాగును ఉచ్చరించింది వీడే" నన్నాడు రామ్మూర్తి.

"పొరబడ్డారు! నా ఉద్యోగం అది కాదు. మొన్నమొన్నటి వరకూ హైదరాబాద్ రోడ్లు కొలిచే డిపార్టుమెంటులో పనిజేశాను. ఈ మధ్యే ఈ రామ్మూర్తి అనేవాడి ప్రోద్బలంతో రేడియో కార్యక్రమాల్లో పాల్గొంటున్నాను. ఇంకా నా సంగతి చెబితే సా. ద. అనుకుంటారేమోనని భయంగా ఉంది. లాపోతే మొన్న 24 వ తేదీనాడు "నవ్య సౌరభాలు" అనే కార్యక్రమంలో బ్రహ్మాండమైన ఓ పాట పాడేశానని చెప్పేద్దును" అన్నాడు గర్వంగా. ఇందిర తెల్లబోయి అతణ్ని చూసింది.

"నిజంవేనండి! ఇతడి గానం అద్భుతంగా వుందనీ, తిరుగా ఇతడిచే పాటలు పాడించమనీ శ్రోతలు చాలామంది దేశం నలుమూలలనుంచి మాకు ఉత్తరాలు వ్రాశారు" అన్నాడు రామ్మూర్తి.

"ఏంవనుకున్నారు మరి! రేపో పాట మళ్లీ రేడియోలో పాడబోతున్నాను. ఆ పాటను సిద్ధం చేసుకోడానికనే ఇక్కడి కొచ్చాము. ఆ పాటను రెండు సార్లు పలుకుదామని అనుకున్నాను ఇంతలోకే మీరున్నా ......" సుందర్రావు ఆమె మొహంలోకి చూస్తూ అన్నాడు, కాస్త ఆశ్చర్యపోతూ.

ఇందిర మెల్లగా వారి ప్రక్కనే చదికిల బడింది. రామం గాభరా పడ్డాడు. "ఒరేయ్! కొంపదీసి ఈ అమ్మాయి మూర్ఛబోవటం లేదుగదా!" అన్నాడు. ఈ మాట ఆటంబాంబులా పనిచేసింది. ఇందిర తారాజువ్వలా లేచి "ఇన్‌సల్ట్! నాకు మూర్ఛరోగముందంటున్నారా! ఇందాక పిచ్చెక్కిం దన్నారు, ఇప్పుడు మూర్ఛ అంటున్నారా!" అన్నది కోపంగా. సుందర్రావు సర్దివేసే ధోరణిలో "పోనీలెండి! మావా డట్టి తొందర మనిషి. వాణ్ని అట్టే గమనించకండి" అన్నాడు.

"గమనించను సరే. వీళ్లైతే నేనూ ఇన్సల్టు చేస్తాను" అన్నది.

"సరే, అలాగే చేయండి" అని వప్పుకున్నారిద్దరూ.

"ఇప్పుడు కాదు. నా కెప్పు డిష్టమయితే అప్పుడు చేస్తాను" అన్నది.

"సరే, సరే!" బేషరతుగా అంగీకరించారు.

ఇందిర నవ్వు తెచ్చుకుని, "ఇంతకూ రేడియోలో పాడిన సుందర్రావు మీరేనా?" అని అడిగి, అతడి ప్రక్కనే కూర్చుంది.

"మరేనండి!" అన్నాడు సుందర్రావు బెరుగ్గా. ఏం మాటలాడితే ఏం ముంచుకు వస్తుందోనని భయపడ్డాడు కూడా.

"అబ్బ! ఎలాగైతే నేం కనిపించారు! మిమ్మల్ని కలుసుకోవాలని ఎన్నాళ్లనించో అనుకుంటున్నాను."

"ఆ విషయం మీరు నాకు ముందుగా తెల్పి వుంటే నేను వెంటనే వచ్చి మిమ్మల్ని కలుసుకునేవాణ్నే సుమండీ!" అన్నాడు సుందర్రావు.

"మరేం! మీరంత బాగా పాడారు కదా మీకు సాపాలు తెలీవా?" అనడిగింది ఇందిర.

"తెలీకేం? మహ చక్కగా తెలుసు."

"తెలిస్తే మరేం! మీ రవి పాడలేదేం? పాటలాగే పాడారే!" ఈ కాంప్లిమెంటు అద్భుతంగా ఉందనుకున్నాడు సుందర్రావు.

"పాటను పాటలాగే పాడాలి. సాపాలు కావాలంటే అనొచ్చు. వింటారా?" అన్నాడు.

"వద్దు వద్దు. అనబోకండి. నాకు తల తిరిగి నట్టుంటుంది. మరేం ! మా పంతులమ్మ ! అన్నీ అలాగే పాడా లంటుంది. అలా పాడితే ఏమైనా బావుంటుందీ ?"

"ఏం బావుంటుందీ ! ఏమాత్రం బావుంటుందీ!"

"మనిద్దరి భావాలు బాగా సరిపోయాయే ! మరేం ! ఆవిడ నా కన్నీ అవే నేర్పుతుంది. అలా చేయడం ఏమైనా బావుందీ ?" బుంగమూతి పెట్టి మురిపెంగా అడిగింది.

"అబ్బే ఏం బావుందీ ? కాస్తయినా బావులేదు."

"భలే ! భలే చెబుతున్నారండీ ! మరేం ! ఆవిడన్నీ అలాగే పాడుతుంది. ఇలా చేస్తే ఏమయినా బావుంటుందీ ?"

"ఆవిడయితే బావుంటుంది. ఎందుకంటే ఆవిడకు సరిగ్గా నేర్పడం రాకపోవడమే గాక, సరిగ్గా పాడడం కూడా రాదని నా అభిప్రాయం."

"గుడ్ ! నా అభిప్రాయం కూడా అదే ! మరేం! నాకో మంచి అయిడియా తట్టింది. మా టీచరుంది చూడండీ ........ "

సుందరరావు పార్కంతా కలియజూశాడు. "అబ్బే ! ఆ మూల ఒక ఫలహారం పొట్లం తప్ప మీ టీచ రెక్కడా కనబడ్డం లేదండీ !" అన్నాడు. రామం గొంతు తగ్గించి అతడితో రహస్యంగా "ఒరేయ్ ! వోవరాక్షన్ చేస్తున్నావురా ! కాస్త తగ్గు" అన్నాడు. సుందరరావు అతడి వంక తిరిగి మెల్లగా "నీకేం తెలుసోయ్ ! మతి తప్పిన అమ్మాయిల దగ్గర శ్రుతిమించి ప్రవర్తించాలి!" అన్నాడు.

ఇందిర చెబుతోంది : "మా టీచరుంది చూడండి. ఆవిడను మానాన్నతో చెప్పి ఈరోజు నించీ ఇంటికి పంపించెయ్యదలుచుకున్నాను."

"మంచి పని చెయ్యదలచుకున్నారు. ఎవరింట్లో వా రుండడం మంచిది." సుందరరావు ఆమె నిశ్చయాన్ని హర్షించాడు.

"మీ రిప్పుడు నాతో మా యింటికి రారాదూ ? అనడిగిం దామె.

"మధ్య నే నెందుకండీ ?" అతడు విస్తుబోయాడు.

"మా టీచరుకు గుడ్‌బై చెబుతా నన్నాను కదా ?"

"అవును."

"అప్పు డామె మొహ మెలా ఉంటుం దంటారు చూట్టానికి ?"

"బలే రంజుగా ఉంటుందండీ !"

"రంజుగా ఉంటుంది కదూ !"

"సందేహమా !"

"అయితే ఆవిడ మొహం చూద్దురుగాని పదండి."

'చూడా లంటారా ?"

"తప్పకండా !"

"వెళ్లాలంటారా ?"

"అవశ్యం" అంటూ ఇందిర లంచ్ బాస్కెట్ వేపు దారితీసింది.

"ఒరే రామం ! కర్తవ్యం ?" సుందరరావు ప్రశ్న

"వెంబడించడం."

"మరి నీవో ?"

"అనవసరం !"

"ఓరి రావణాసురుడా ! అప్తమిత్రుణ్ణి, అందులో నీ ప్రోగ్రాం కోసం ఎంతో కష్టపడిన వాణ్ణి మనస్సు సరైన స్థితిలో ఉన్నదని రుజువు గాని వో అమ్మాయితో వదిలేసి చక్కా పోతావుట్రా ఈవిడే యిలా ఉన్నదే ! ఇక యీమె తండ్రి ఎలా ఉంటాడో !" ఆకాశానికి నమస్కరించాడు.

"ఏం చేస్తాం. ఏడు. నీ ఖర్మ .... వస్తానండి తొందరాదేవిగారూ !" రామ్మూర్తి అన్నాడు.

"మంచిది. వెళ్లిరండి హరమతిగారూ" అన్నది ఇందిర.

* * * *

ఆఫీసురూం లోనికి చెంగున లేడిపిల్లలా ఎగురుకుంటూ వచ్చి ఇందిర రఘునాథరావుగారు రాసుకుంటున్న కుర్చీ మోచేతిపై కూర్చుంది. సుందరరావు బడిపిల్లవాడిలా ఆమె ననుసరించి వచ్చి టేబుల్ దగ్గర నిలబడిపోయాడు.

"భోజనానికి పిలవడాని కొచ్చావా, అమ్మాయ్ ?' అనడిగారాయన తలెత్తకుండానే.

"కాదు నాన్నా ! మా టీచరును మానిపించెయ్యండి !" అన్నది ఇందిర.

రఘునాథరావుగారికి తొందరగా మాట అర్థం కావు. ఎప్పుడూ ఫైళ్లలో తలదూర్చి ఉండడమే అందుకు కారణం. ఆయన తలెత్తి కుమార్తె వంక కాసేపు చూసి "నీ వనే దేమిటమ్మాయ్ ?" అనడిగారు.

"నాకు సంగీతం చెప్పే టీచరు లేదూ ! ఆవిడను మానిపించెయ్యండి నాన్నా !" అన్నది ఇందిర వోపిగ్గా.

"మరి నీవు సంగీతం నేర్చుకుంటా నంటివి కదమ్మా ?" అనడిగారు తిరిగి తల ఫైళ్లలోనికి పోనిస్తూ. ఒక్కోసారి ఆయన బుర్ర అమోఘంగా పనిచేస్తుంటుంది.

"నేను ఆవిడ దగ్గర మానేసి, సుందరరావ్ అనే ఆయన దగ్గర సంగీతం నేర్చుకుంటానండీ ! ఇదిగో ఈయన గొప్ప విద్వాన్ ! రేడియోల్లో పాడుతుంటాడు" అని సుందరరావును చూపింది.

రఘునాథరావుగారు తలెత్తి సుందరరావుని చూశారు. అతణ్ణిగురించి ఇందిర చెప్పింది ఆయన వినలేదు. తేరిపార అతడి వంక చూశారు. ఎవరీ నూతన వ్యక్తి ? ఏం పనిమీద వచ్చాడో ఆయనకు తెలియలేదు. బహుశః ఏదో వ్యాపారం పనిమీదనే వచ్చివుంటా డనుకున్నారు. "నమస్తే ! అలా కూర్చోండి !" అని కుర్చీ చూపించారు. సుందరరావు జంకుతూ కుర్చీలో కూర్చున్నాడు.

"మీరేం పనిమీద వచ్చారండీ ?" అనడిగారు.

"నేను .... నేను .... మీ అమ్మాయి .... " సుందరరావు నీళ్లు నమిలాడు. ఇందిర కలిగించుకుని "కాదు నాన్నా ! ఈయన సుందరరావని ప్రఖ్యాత సంగీత విద్వాంసులు. నే నీయన దగ్గర సంగీతం నేర్చుకుంటాను" అన్నది.

"మరిప్పుడు నీ కొక టీచ రున్నది కదమ్మా ?" ఆమె తండ్రి అడిగాడు.

"మ .... మ్మరేనండీ .... " సుందరరావేదో చెప్పబోయాడు.

ఒకరు — సినిమా ఎలా ఉందిరా?

మరొకడు — చాలా బాగుందిరా!

ఒకరు—జనం ఎలా వస్తున్నారు?

మరొకరు—టిక్కెట్లు కొనుక్కొని గేటు లోపలి నుంచి వస్తున్నారు.

—కె. ఎస్. మూర్తి (అనకాపల్లి)

"ఆవిణ్ణి తీసివేయాలని చెప్పాను కదండీ !" ఇందిర కంఠంలో విసుగుతోచింది.

"ఓహో ! ఆవిణ్ణి తీసివేయాలంటావా ! బావుంది. చక్కగా చెప్పావమ్మా ! అరటిపండొలిచి చేతబెట్టినట్టు చెప్పావు. బాగా అర్థమయింది. ఆవిడను తీసివేయాలన్నమాట. వెరీ గుడ్ ! తీసివేయాలి !" మర్చిపోకుండా యీ విషయం వల్లె వేస్తున్నట్టు అన్నారు రఘునాథరావుగారు.

"అంతేకాదు ! ఈ సుందరరావుగారిని ఆవిడ స్థానంలో వేయాలి" అన్నది ఇందిర పట్టుదలగా.

"ఓ .... హోహో ! అలాగా. ఈయన్ను ఆవిడ స్థానంలో వేయాలి. బావుంది. అలానే చేసేద్దాం. వెంటనే చేసేద్దాం !"

"అది కాదండీ .... " అని సుందరరావు ప్రారంభించాడు కాస్త ధైర్యాన్ని కూడగట్టుకుని.

"అరే ! అదికూడా కాదన్నమాట ! ఏదో చిక్కుగా ఉన్నట్టుందే వ్యవహారం చూస్తే" అన్నారు రఘునాథరావుగారు తిరుగా ఫైళ్లలోకి తల దూరుస్తూ.

"మరేనండి .... " సుందరరావు మొదలెట్టాడు మెల్లగా.

"చెప్పండి" సుందరరావుకు ప్రోత్సాహం ఇస్తున్నట్టు తల వంచుకునే చెప్పారు రఘునాథరావుగారు.

"నేనండీ .... "

"కానీండి !"

"చూడండి ! .... "

"తర్వాతండి ?"

"అహ ! అది కాదండి."

"సర్లెండి."

ఛ ! ఈ రకంగా అయితే సంభాషణ కాస్తయినా ముందుకు జరగదని సుందరరావుకి అర్థమైపోయింది. సాహసించి, వూపిరిపీల్చుకుని ఒక్క గుక్కలో చెప్పేశాడు. "నేననే దేమంటే మీ అమ్మాయికి సంగీతం ట్యూషన్ చెప్పడానికి నే నిప్పుడు ఇక్కడికి రాలేదు !"

"ఓహో ! అలాగా !" అన్నారు రఘునాథరావుగారు ఓ ఫైల్‌ను సీరియస్‌గా చదివేస్తూ.

(52-వ పేజీ చూడండి)

"మరి నేను దేని కొచ్చానంటే . ."

"అవును ! దేని కొచ్చారు ?"

"మీ అమ్మాయికి సంగీతం చెప్పే టీచరు మొహం చూడ్డాని కొచ్చాను!" అని జవాబిచ్చాడు సుందర్రావు. ఈ మాటతో రఘునాథరావుగారు ఫైళ్లనుండి బయటి కొచ్చారు. నీళ్లలోంచి బయటికి వచ్చిన హిప్పొపొటామస్ ఆశ్చర్యంగా ఎలా చూస్తుందో, ఆయన గూడా అలాగే ఆశ్చర్యంగా సుందర్రావు కేసి చూశారు

"కావాలంటే మీ అమ్మాయినే అడగండి ! టీచర్ని పనిలోంచి తీసివేసినప్పుడు చూట్టానికి ఆవిడ మొహం బలే రంజుగా ఉంటుందని చెప్పి మీ అమ్మాయి నన్ను పార్కు నుంచి తీసుకొని వచ్చింది. ఆమెనే అడగండి!" అన్నాడు సుందర్రావు గట్టిగా తాను నిర్దోషి నన్నట్టు.

ఇందిర గది బయటకు తొంగిచూసి "అదుగో నాన్నా ! మా టీచర్ వచ్చేసింది ! ఆవిడకు చెప్పేయండి !" అన్నది. రఘునాథరావుగారు కళ్ల జోడును రుమాలుతో తుడుచుకుంటూ గొంతు

# వసంత

(13 వ పేజీ తరువాయి)

సర్దుకోవడం ఆరంభించారు. ముఖ్యమైన నిశ్చయాలు చేయాల్సి వచ్చినప్పుడు ఆయ నిలాగే ప్రవర్తిస్తారు.

"ఏదండీ ! టీచర్ ! మా నాన్న మిమ్మల్ని పిలుస్తున్నారు !" అని ఇందిర కేకేసింది.

"పిలిచారుటండీ ! ఏవిటీ విశేషం ?" అని ఆవిడ గదిలోకి ప్రవేశించింది.

ప్రళయం వస్తుందని ముందుగానే తెలుసుకున్న ఇటాలియన్ జ్యోతిష్కులు జనావళి అమాయకత్వాన్ని చూసి నవ్వుకున్నట్టుగా సుందర్రావు ఆమెను చూసి నవ్వుకున్నాడు. ఇహ రఘునాథరావుగారు ఇరకాటంలో పడ్డారు. ఎలా మొదలెట్టాలో తెలీక గొంతు సవరించుకుని "మా అమ్మాయికీ .... తర్వా తేమిటమ్మాయ్ ?" అని ప్రశ్నించారు.

"మీ సంగీతం చాలు" అని ఇందిర పూర్తి చేసింది.

"కాబట్టి ఈరోజు నుంచీ .... " ఆయన తిరుగా అందుకున్నారు.

"మిమ్మల్నీ పనిలోంచి తీసివేస్తున్నాం."

"ఇక మీకూ .... "

"రాం ! రాం !!"

తండ్రీ కూతు ళ్లిద్దరూ యుగళగీతంలా తలో మాటా అందుకుని మాటాడేస్తూంటే విని సంగీతం టీచర్ ఆశ్చర్యపోయింది. వీరి కీ మాటలిలా మాట్లాడ్డాని కెలా ధైర్యం వచ్చిందనే ఆమె ఆశ్చర్యమంతా. ఆమెది కాస్త బలమైన ప్రకృతి. తేలిగ్గా ఎవరూ లెక్క లేనట్టు మాటాడేస్తుంది. ఇప్పుడూ అలాగే అంది. "ఆ ! ఏవిటండీ అలా అంటారూ ? సహం, సహం నేర్చుకుంటే, ఏదో సామెత చెప్పినట్టు, ఏం బావుంటుంది ? ఇంకా వర్ణాలన్నా పూర్తికాలేదు. అవన్నీ అయాకే చూసుకుందాం లెండి !" అనేసింది మామూలు ధోరణిలో.

రఘునాథరావుగారు కూతురు మొహం చూశారు. "ఆవిడ అంటున్నదీ బాగున్నది కదమ్మాయ్!" అంటున్నట్టు మొహం పెట్టారు. కాని ఇందిర పట్టుదలగా అంది : "అవన్నీ మాకు తెలుసు ! మీరిక వెళ్లి వస్తారా !"

"అయ్యో ! అలా అంటే ఎలా ? పోనీ యిప్పుడు నేర్చుకుంటున్న వర్ణమన్నా పూర్తి కానీయండి !" అన్నది రఘునాథరావుగారితో ఆమె.

"మీ కెందు కా శ్రమ ?" అని ఇందిర ప్రశ్నించింది

"శ్రమేందు కమ్మాయ్ ! చూడు అది నీ కింకా సరిగా రాలేదు. దానిలో నీవు శుద్ధ రిషభం వేస్తున్నావు—" ఇందిర మధ్యలో అందుకుని,

"తెలుసులెండి. రెండోది వేయాలి. ఇక మీరు సెలవు పుచ్చుకుంటారా ?" అంది ధీమాగా అడుగు ముందుకు వేస్తూ.

"అంతే నంటారా ?"

"అంతే !" ఆవిడ బయటకు నడిచింది.

## కలహకాండ

"మీరు పాట వింటారా ? వాయిద్యం నేర్చుకుంటారా ? ఇందిరా !" అనడిగాడు సుందర్రావు.

"మీ పాటనే వింటాను" అన్నది ఇందిర.

"నెల్లాళ్లయి ఇదే వరసేనా ?"

"నెల్లాళ్లన్నమాటేమిటి ? మీ పాట వింటూ అలా మేఘాలెక్కి ఎన్ని సంవత్సరాలైనా తిరిగి రావచ్చు !"

"మీ మెచ్చికోలుకు నా ధన్యవాదాలు ! కాని మీరు సాధన చేస్తేనే గాని వాయిద్యం రాదు. ఆలోచించండి నేర్చుకోవడం మీ విధి. చెప్పడం నా ధర్మం. వృథా కాలయాపనవల్ల లాభం ?"

"నేను సాధన తర్వాత చేస్తాను. ముందు మీరో పాట పాడండి "

"నేను పాటపాడితే మీకేం లాభం ?"

"మనసుకు సంతోషం కలగడం !"

"అదే ముఖ్యమన్నమాట మీకు ! అలా గయితే రేడియో పెట్టుకోండి."

# చాటుకథామంజరి

ఏమి తిని సెపితివి కపితము
బ్రమపడి వెఱిపుచ్చకాయ వడిదిని సెపితో
యుమెతకయు తిని సెపితివొ
అమవసనిసియనెడి మాట యులసనిపెసినా!

అని పద్యము చెప్పినాడు.

తెనాలి రామలింగకవికి రామకృష్ణుడని కూడ పేరు కలదు. మొదట శైవుడైన ఈతడు వైష్ణవుడగుటచేత రామకృష్ణుడు అని పేరు మారినట్లు తెలియుచున్నది.

తిరుమలరాయడు తనపైపద్యము చెప్పుమని రామలింగని కోరగా—

అన్నాతి గూడ హరుడగు
నన్నాతిని గూడకున్న నసురగురు డే
నన్నా! తిరుమల రాయడు
కన్నొకటి లేదుగాని కంతుడుగాడే.

అని గేలిచేసినాడు.

ఈ మహాకవిని వికటకవిగా నేకాక వినయశీలిగా కూడ నిరూపించు రెండు చాటువులు.

తెంగేల రామకృష్ణుని
బంగరు కడియంబు బుండ బాడితుడగునా
జంగులు జల్లులు గిలిగిం
సింగారివు టూర గుర్కు సింగంబగునా

కవి య్యల్లసాని పెద్దన
కవి తిక్కన సోమయాజి గణుతింపంగా
కవి నేను రామకృష్ణుడ
కవియను నామంబు నీటికాకికి లేదే.

తెనాలి రామన అసలు పేరు గార్లపాటి (రామయ) రామలింగకవి. తెనాలి ఈతని స్వగ్రామము.

ఆంధ్ర భూమీశ చాగ్రహారాభమైన
శ్రీ తెనాల్యగ్రహారనిర్ణేత వగ్ర
కాభికాకోకిలమ వీవు సరసకవివి
రమ్యగుణ కృష్ణ రామయ రామకృష్ణ

అని ఆయనే చెప్పుకున్నాడు.

తెనాలి రామలింగని పేరు చెబితే ఏడు కథలు చెప్పుకోవాలని అంటారు. ఈ మహాకవి చిర కీర్తి పతాకలుగా వెలయు అనేక చాటు పద్యములలో

లింగనిషిద్ధు కల్వలచెలిం గని మేచకకంధరుం ద్రిశూ
లింగని సంగతాళి లవలింగని కిర్దమదూషితన్ మ్మణా
లింగని కష్ణచేలుని హలింగని నీలకచన్ విధాత్మనా
లింగని రామలింగ కవిలింగనికీర్తి హసించు దిక్కులన్

అను పద్యము మరపురానిది. అంతటి శుద్ధమైన యశశ్చంద్రిక రామలింగని కీర్తిపతాక.

★

"మిమ్మల్నెక్కువగా బ్రతిమాలలేను. ముందో పాట పాడండి!"

"అలా వీలుకాదు. ముందు వయొలిన్ తియ్యండి!"

"నే జెప్పిన మాట వినరా?" అనడిగింది ఇందిర.

"లాభంలేదు" సుందర్రావు ఖండితంగా చెప్పాడు.

ఇందిర ఓపికను చంపేసుకుని "ఏమనుకుంటున్నారో! పాఠం చెప్పడం కాదు, నేను చెప్పిన పని చెయ్యడం మీ ధర్మం" అన్నది. సుందర్రావు అనవసరమైన ఈ మాటకు కోపం తెచ్చుకున్నాడు. కాని కాస్త నిభాయించుకుని "మీరు నా కివాళ ధర్మపన్నాలు చెబుతున్నారా?" అన్నాడు.

"మీ విధ్యుక్తధర్మం విస్మరించినపుడు గుర్తుకు తెస్తున్నాను మాత్రం!" అన్నది ఇందిర పెడసరంగా.

"నా విధ్యుక్తధర్మం ఏవిటో సెలవిస్తారా?"

"ఆలోచించండి! మీ రెక్కడ కొలువు చేస్తున్నారో, ఎవరి ఆజ్ఞను పాలించాలో! మీకు తెలియనిది కాదు!!"

మాటలు చిత్రమైనవి. అవి మనసులో అణగారి ఉండినంతసేపూ వాటి కే చలనమూ వుండదు కాని అవి పెద్దవి. దాటి బయటికి వచ్చాక వాటికి అమోఘమైన శక్తి వస్తుంది కొన్ని కత్తులూ, ఈటెలూ, బల్లాలూ అయి చిత్రవధ చేస్తాయి. కొన్ని సుధాస్రవంతిని ప్రవహింపజేస్తాయి. కొన్ని మాటలు ఎదుటి వారికే గాక మాటాడిన వారికి గూడా ఆశ్చర్యాన్ని కలుగజేస్తాయి. ఈ మాటలు విని సుందర్రావెలా ఆశ్చర్యపోయాడో, ఇందిర కూడా అలానే ఆశ్చర్యపోయింది. విద్యుద్ఘాతం తగిలిన వాడిలా అతడు మూగవోయాడు ఇందిర కూడా ఒక్క త్రుటిలో తన పొరపాటును గుర్తించింది.

సుందర్రావు మెల్లగా లేచాడు "క్షమించండి! ఈ పరిస్థితుల్లో మీకు పాఠాన్ని చెప్పలేను" అన్నాడు ముందుకో రెండడుగులు వేసి "నేను మీ కోరికపైనే ఈ పనికి ఒప్పుకున్నా నన్న విషయం మీరు మరువవలే దనుకుంటా! అయినా మీరు నన్నిలా అవమానించడానికి సాహసించారు ఈ పని సబబైనదేమో మీ అంతరాత్మ నడగండి మీరు చూపిన కృతజ్ఞతకు నా ధన్యవాదాలు!" అన్నాడు మెల్లగా ముందుకు నడిచాడు

ఇందిర మనస్సు కలకదేరింది క్రోధాగ్ని కీలలలో వ్రేలి ఎరుపుగా మారి, ఎరుపునుండి స్ఫటికంలాగా స్వచ్ఛంగా పరిశుద్ధమైనదై, పశ్చాత్తాపతుషారంలో తడిసి, భావావేశంలో ఒళ్లు మరచి, ఆమె మనసు సుళ్లు తిరిగి, కట్టలు త్రెంచుకుని త్రుళ్లి ళ్ళున బయటపడింది మెల్లిగా వెళ్ళుతున్న సుందర్ కేసి తిరిగి "ఆగండి! నన్నిలా బాధించి వెళ్లడానికి మీ కెవ రధికార మిచ్చారు?" అన్నది వెక్కి వెక్కి ఏడుస్తూ.

"నేను మిమ్మల్ని బాధించలేదనే విషయం మీ మనసుకు తెలుసునని నాకు తెలుసు ఇందిరా!" అన్నాడు సుందర్రావు

"ఏమి తెలుసు మీకు నా మనసులో విషయం? నన్ను వయొలిన్ వాయించమని వూరికే వేధించారు. నేను ముచ్చటగా వో పాట పాడమంటే పాడలేదు. కాని మీ పాటకు శ్రుతిగా నా మనసులో ఎన్ని వాయులీనాలు మ్రోగుతున్నాయో తెలుసుకున్నారా? మిమ్మల్ని అవమానించేంత మూర్ఖురాల ననుకున్నారా? మీ రొచ్చాక నా మనసులో వేయి వసంతాలు చిగిర్చాయని తెలుసుకున్నారా? తెలుసంటారే! ఇదేనా మీరు తెలుసుకున్నది!" రుద్ధమైన కంఠంతో బాష్పధారలు కాలువగట్టుతుంటే మేడమెట్ల రెయిలింగ్‌పై తల ఆన్చి ఇందిర ఏడ్చింది. సుందర్రావు ముందు కొక అడుగువేసి ఆగి, కాసేపు నించొని ఇందిరన్న చూసి, మెల్లగా ఆమెవద్దకు వెళ్లి ఆమె తలపై చేయి ఉంచాడు. అతడి కర్థమయింది.

## కల్యాణకాండ

"అమ్మాయ్! నీకు వివాహం చేసెయ్య దలుచుకున్నాను" అన్నారు రఘునాథరావుగారు హాల్లోకి వస్తూ. ఆయన వెనకాలే రామ్మూర్తి కూడా వచ్చాడు. ఇద్దరూ సోఫాలో కూర్చున్నారు ఇందిర వచ్చి తండ్రి ప్రక్కనే కూర్చుంది.

"మా అమ్మాయికి వివాహం చేసెయ్య దలుచుకున్నానోయ్! ఎలా ఉంది ఆయిడియా?" అనడిగారు రామ్మూర్తిని

"భేషుగ్గా ఉందండీ!" అన్నాడు రామ్మూర్తి. "ఈ అయిడియా చెప్పడానికేనా ఈయన ఇంత దూరం నన్ను తీసుకొచ్చాడు?" అనుకున్నాడు మనసులో.

"ఫో నాన్నా! నీ వెప్పుడూ అలాగే అంటావు!" అంది ఇందిర సిగ్గుతో.

"లేదమ్మాయ్! ఈసారి నిశ్చయంగా నిశ్చయం చేశాను!" అన్నారు రఘునాథరావుగారు ఇందిర సిగ్గుతో కళ్లు మూసుకుంది.

"ఇంతకూ వరు డెవరండీ?" అనడిగాడు రామం నవ్వుతూ.

నాటకం సాగుతూంది.
రాక్షస వేషధారి ఇలా అన్నాడు: "నరవాసన... నరవాసన..."
రాక్షసి వేషధారిణి—మీకే మన్నా మతిపోయిందా ఏమి? మనమూ మనచుట్టూ ఉన్న వారందరూ నరులేగా.
—ఎస్. వి. దేవన్ (రాయచూర్)

"అవును! వరు డెవరు చెప్మా? మరచిపోయానూ? . వో యస్! జ్ఞాపక మొచ్చింది. రాజారావని నా స్నేహితు డొక డున్నాడు. వాళ్లబ్బాయి ఈ వూళ్లోనే పని చేస్తున్నాడు ఆ అబ్బాయి పేరు రామ్మూర్తి. అతడే వరుడు"

"బాబోయ్ నేనా!" ఆరంగుళాలు ఎగిరి సోఫా మీద పడ్డాడు రామ్మూర్తి.

"ఓహో! రామ్మూర్తి అంటే నీవే కదూ. ఇందాక స్టుడియోదగ్గర్నుంచి నిన్ను తీసుకు వస్తున్నప్పుడే కార్లో నీ కీ సంగతి చెబుదా మనుకున్నాను. మర్చిపోయాను. ఉదయం మీ నాన్నతో ఫోన్‌లో మాట్లాడానోయ్! అమ్మాయి నీకు నచ్చితే చాలని చెప్పాడు మీ నాన్న. ఇదిగో చూడు మా అమ్మాయి! నచ్చిందా?"

"అబ్బే! ఈ అమ్మాయి నాకు కాస్తయినా నచ్చలేదండీ! వోసారి పార్కులో నన్ను "హారమతి!" అని పిల్చి ఇన్సల్ట్ చేసింది ఈమె!" అన్నాడు రామ్మూర్తి.

"నాన్నా! ఈయనే! మరే!! నాకు మూర్ఛరోగ ముందని అన్నాడు నాన్నా!" అంది ఇందిర.

"అలాగుటమ్మా! వెరీబాడ్!! వెరీ బాడ్!"

"అంతేకాదు నాన్నా! ఈయనే! నాకు పిచ్చెక్కిందని కూడా అన్నాడు నాన్నా!"

"అలాగా!"

రామ్మూర్తి అందుకున్నాడు: "ఏవండోయ్! మీ అమ్మాయి నాకు నచ్చక పోవడానికి మరో కారణం ఈమె అప్పుడే సుందర్రావనే అబ్బాయికి మనసిచ్చేసింది!"

"అవునుటమ్మాయ్!" అనడిగారు రఘునాథరావుగారు కుమార్తెను. ఇందిర తల వంచుకుని సిగ్గుతో గదిలోంచి పారిపోయింది.

"ఎలాగా? ఇప్పుడేం చేద్దాం?" అన్నారాయన తికమకగా. రామ్మూర్తి మాటాడలేదు. కాసేపు ఆలోచించి ఆయన "నా కో వూహ తడుతూందోయ్!" అన్నాడు రామంతో.

"ఏవిటండీ అది?"

"ఇందిరను సుందరరావు కిచ్చి కళ్యాణం చేసేద్దాం! ఎలా ఉంది ఐడియా!" అన్నారు

"భేషుగ్గా ఉందండీ! చాలా చాలా భేషుగ్గా ఉంది" అన్నాడు రామ్మూర్తి

కళ్యాణశోభతో కలకల్లాడుతూ, మిత్రుల అభినందనలను గైకొని, "నాకు తెలుసోయ్ మా వాడు ప్రయోజకు డవుతాడని!" అని నాన్న మిత్రులతో అంటూంటే సంతోషించి, "మా నాయనే!" అని నాన్నమ్మతో మెటికలు విరిపించుకొని, తల్లి ఆనంద బాష్పాలను తనివిదీరా చూసి, తమ్ముళ్ళు, అక్కలు, బావలు, మరదళ్లు హాస్యాలాడుతూంటే భరించి, రామానికి స్పెషల్ థాంక్స్ చెప్పుకొని సుందర్రావు మేడమీద శోభాయమానంగా అలంకరించబడిన శోభనం గదిలో "ఇంక నా జీవితంలో వసంతరాగపు సంగతులు తప్ప ముఖారి కళలు రానేరావు!" అన్నాడు ఇందిరను దగ్గరకు లాక్కుంటూ. ★